

# నల్లధనం... Null ధనం


ఆంగ్లమూలం: ముత్తు సుందరరాజన్

అనువాదం: కొల్లూరి సోమశంకర్


సింగిల్ పేజి కథ

గుడి పూజారి బ్యాంకు కార్డు అడిగేసరికి నేను బిత్తరపోయాను.

నేనందించిన వంద రూపాయల నోటుని, గాంధి తాత బోసినవ్వుని ఆయన తిరస్కరించాడు.

"నాయనా, ఈ కరెన్సీ నోటుకి పుణ్యలోకాలు ప్రాప్తించాయి. అది ఈ లోకంతో అన్ని భవబంధాలు తెంచుకుంది. దాని విలువ కోల్పోయి, ఓ కాగితం ముక్కలా మిగిలిందంతే..."

"ఆశ్చర్యంగా ఉంది పూజారిగారూ, అంటే మీ ఉద్దేశ్యంలో వంద రూపాయల నోట్లు మన దేశంలో ఇక చెల్లవా?"

"వందరూపాయల నోట్లేకాదు, ఇండియాలో అసలు కరెన్సీనోట్లే చెల్లవు. అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చిన ప్రభుత్వ నిర్ణయం నీకు తెలీదా?"

"ఏం నిర్ణయం? నాకేం తెలీదే? నేను నిన్న సాయంత్రమే ఇండియాకి వచ్చాను. సర్లెండి. అయితే రోజూవారీ లావాదేవీల మాటేమిటి?"

"కార్డులు చెక్కులు వాడాలి"

నేనప్పుడు పక్కడి తిరిగి గుడి గోడలపై చూసాను. రెండు కార్డు రీడర్ మెషిన్లు గోడకి బిగించున్నాయి. వాటి పక్కనే పూజల వివరాలు, రేట్ల పట్టిక, కోడ్ నెంబర్లు రాసున్నాయి. నా కార్డుని స్వైప్ చేసి, పూజ ముగించుకుని బయటకి వచ్చాను. మూల విరాట్టుకేసి చూసినప్పుడు ఆయన నన్ను చూసి చిన్నగా నవ్వినట్లనిపించింది. ఆ నవ్వుకి ఎన్నో అర్థాలు...! గుడిలో టెక్నాలజీ!

మనసుని చదవడం బిచ్చగాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. దైవాన్ని దర్శించుకుని, జనాలు ప్రశాంతంగా గుళ్ళొంచి బయటకి వచ్చే సమయం అడుక్కోడానికి సరైనదని వాళ్ళకి బాగా తెలుసు. కానీ నా మనసు ప్రశాంతంగా లేదు. నాచుట్టుపక్కల జరుగుతున్న సంఘటనలపై నా మదిలో ఎన్నో ప్రశ్నలు...! నా జేబులో ఉన్న రూపాయి బిళ్ళలు చివరికి బిచ్చగాళ్ళకి కూడ అక్కర్లేకుండా పోయాయి. ఏంటీ వింత?

"అయ్యగోరు, డబ్బులు వద్దండీ! చిన్న చిన్న మొత్తాలకి బ్యాంకులు కాష్-స్లిప్‌లు ఇస్తున్నాయి. మేము కూడ వాటినే తీసుకుంటున్నాము. వాటిని మా ఎకౌంట్లలో జమ చేసుకుంటాం".

నాకు నోట మాట రాలేదు.

"ఏంటీ మీకు బ్యాంకు ఎకౌంట్లు కూడా ఉన్నాయా?" అని అడిగాను. వాళ్ళు తలూపడంతో, నా కళ్ళు సాసరులా పెద్దగా విచ్చుకున్నాయి...!

నేనిక భరించలేకపోయాను. నేరుగా మా మిత్రుడొకడి ఇంటికి వెళ్ళాను. సరిగ్గా ఆ సమయానికే వాళ్ళావిడ సూపర్ మార్కెట్‌కి వెడుతోంది. మా వాడేమో 'కాష్-స్లిప్‌లు తీసుకో లేదంటే కార్డు తీసుకెళ్ళు' అంటూ ఆమెకి జాగ్రత్తలు చెబుతున్నాడు.

నా ఆతృతని ఆపుకోలేకపోయాను.

"ఒరే, నా ప్రశ్నలకి జవాబులు తెలుసుకోలేకపోతే, నేను మూర్ఛపోయేలా ఉన్నాను. ఈ మార్పులేంటి? అసలు దేశంలో ఏం జరుగుతోంది?" అని అడిగా.

"ఊరికే బేజారైపోకు. ముందు మంచినీళ్ళు తాగు".

కాసిని మంచినీళ్ళు తాగి వాడేం చెప్తాడో విందామని చెవులప్పగించా.

"ఈ నల్లధనం పెద్ద తలనొప్పి అయిపోయింది. మీడియా రిపోర్టులుగానీ, కుంభకోణాలుగానీ, రక్షణశాఖ ఒప్పందాలుగానీ, లేదా ఆస్తుల అమ్మకాలు కొనుగోళ్ళ విషయంలోగానీ, ఎన్నికలలోగానీ నల్లధనందే ప్రధాన పాత్ర! బహుపాదిలా ఇది దేశమంతా విస్తరించింది. ప్రభుత్వం దీన్ని నియంత్రించాలనుకుంది. అందుకని గతంలో వాలంటరీ డిస్క్లోజర్ ఆఫ్ ఇన్‌కం స్కీమ్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దాని ప్రకారం నీ దగ్గరున్న నల్లధనం వివరాలను వెల్లడించి, దాన్ని చట్టబద్ధంగా తెల్లధనంగా మార్చేసుకోవచ్చు. అయితే ఈ పథకం ద్వారా సాధించింది గోరంతే! ఒకప్పుడు ఆర్థిక వ్యవస్థకి సమాంతరంగా ఉన్న ఈ నల్లధనం తన జూలు విదిల్చి ఇప్పుడు వ్యవస్థకే సవాలుగా మారింది. చలామణిలో ఉన్న డబ్బు విలువకి దాదాపు మూడురెట్లు ఎక్కువ నల్లధనం ఉంది. అందుకే ప్రభుత్వానికి కొత్తచర్యలు తీసుకోక తప్పలేదు. మామూలు నోట్లని, నాణాలను చలామణీలోంచి తప్పించింది. కాబట్టి ఇప్పుడు దేశంలో కరెన్సీ నోట్లు నాణాలు చెల్లవు..." అంటూ మా వాడు వివరంగా చెప్పుకొచ్చాడు. "మరి జనాలు వాళ్ళ రోజూవారీ ఆర్థిక వ్యవహారాలను ఎలా నిర్వహిస్తారు?"

"చెక్కులు, కార్డుల ద్వారా! చిన్న చిన్న డినామినేషన్‌లకి బ్యాంకులు ప్రీ-ప్రింటెడ్ కాష్‌స్లిప్‌లు ఇస్తాయి. వాటి మీద ఖాతాదారుల ఎకౌంట్ నెంబర్లు ఉంటాయి.

వాటిని ఉపయోగించి జనాలు ఏ ఊర్లో ఏం కొన్నా, బ్యాంకు స్టేట్‌మెంట్‌లో నమోదైపోతుంది".

"ఇది చాలా దారుణం! జనాల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గత పరచడం సబబు కాదు!" అన్నాను ఆదుర్దాగా.

"ఏం కాదు. బ్యాంకు ఎకౌంట్ స్టేట్‌మెంట్‌ని ఎవరికీ చూపించకుండా ఉంటే సరి" అన్నాడు మా వాడు తేలిగ్గా.

"అంటే నా ఎకౌంట్ స్టేట్‌మెంట్‌ని మా ఆవిడకి కూడ చూపించకూడదన్నమాట".

"అవును. ఈసారి నువ్వెప్పుడైనా ఊరెళ్ళావనుకో. అక్కడ మందు కొట్టి జల్సా చేస్తే ఆ ఖర్చులన్నీ నీ బ్యాంకు ఎకౌంట్ స్టేట్‌మెంట్‌లో నమోదవుతాయి. మీ ఆవిడతో 'ఆఫీస్ టూరని' చెబితే ఆవిడ నీఎకౌంట్ స్టేట్‌మెంట్‌ని పరిశీలించే అవకాశం ఉంటుంది మరి..."

"నో... వీల్లేదు..." అంటూ నేను 72 ఫాంటు సైజులో అరిచాను.

గాఢనిద్ర నుంచి హఠాత్తుగా నాకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరవగానే, నాకేసి గాబరాగా చూస్తూ నాపక్కనే నిలుచున్న మా ఆవిడ కనబడింది.